క్లుప్తంగా

తోపుడు బండి అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ అరండల్‌పేట ప్రాంతానికి చెందిన పేద ముస్లిం మహిళ షేక్ ప్యారికి చిరు వ్యాపారం చేసుకునేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) తోపుడు బండి అందించింది. గాంధీనగర్ దుర్గా కళామందిర్ వద్ద ఆదివారం కమిటీ సభ్యులు ఆమెకు తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 33వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా పేద ముస్లిం మహిళ చిరు వ్యాపారానికి వీలుగా తోపుడు బండి అందజేశామన్నారు. ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ కాలేషా, రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి షేక్ మస్తాన్, అబ్దుల్ ఆరిఫ్, సిలార్ బేగ్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి సానబోయిన సునీత వైద్యఖర్చులకుగానూ ఆదివారం దుర్గాపురంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ మధురానగర్‌కు చెందిన సానబోయిన గంగాప్రసాద్ కుమార్తె సునీత క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము తమ వంతు బాధ్యతగా స్నేహితులతో కలిసి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వీరంకి గోకర్ణేశ్వరరావు, బోడి ఆంజనేయరాజు, మహంతి వాసుదేవరావు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన ఎల్ఎల్. అన్నపూర్ణ ఆలయ అధికారులను కలిసి వనుకూరు వెంకట రమణ పేరిట రూ. 1,00,116, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రహ్మణపల్లి చెన్నాయబోడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలి



పటమట(విజయవాడతూర్పు): డ్రెయిన్లలో ప్రతి రోజు పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం సర్కిల్-3 పరిధిలోని పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్, మదర్‌థెరిస్సా జంక్షన్‌లో పర్యటించారు. సైడ్ డ్రెయినేజీల్లో మురుగు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపరచాలని, మురుగు ప్రవాహానికి అడ్డుగా ఆటంకాలు ఉండటం గమనిస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద కుటుంబాల పట్ల ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని.. పేదలు నివసిస్తున్న బహుళ అంతస్తుల్లో పౌర సదుపాయాల కల్పన, నిర్వహణను నగరపాలకసంస్థ పూర్తిగా గాలికి వదిలేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో విద్యుత్ షాక్‌తో మైనా అనే బాలిక మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు, బాక్సుల వద్ద వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని, అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడం వల్ల నిర్వహణ కొరవడి వీటికి రక్షణ లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి బాలిక కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఎండ తీవ్రతతో ఇబ్బందులు
- భక్తులకు మజ్జిగ పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో పాటు సాధారణ భక్తులు అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. ఇంద్రకీలాద్రిపై పవిత్రోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. పవిత్రోత్సవాలు కావడంతో ఆదివారం ఉదయం 8.25 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అమ్మవారి పూజా కార్యక్రమాల అనంతరం దర్శనాలు ప్రారంభం కాగా, మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ముఖ్యంగా జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వైజాగ్, తిరుపతి వంటి మహా నగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు, ఇటు మహా మండపం 5వ అంతస్తు వరకు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ. 300 టికెటు క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. మహా నివేదన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లు వేగంగా ముందుకు కదిలేలా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ పంపిణీని ఆలయ ప్రాంగణంలో ప్రారంభించారు. లక్ష్మీగణపతి విగ్రహం వద్ద మజ్జిగ వితరణ చేయడంతో పాటు క్యూలైన్‌లో ఉన్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, కనకదుర్గ అమ్మవారు(ఇన్‌సెట్‌లో)

సామూహిక వరలక్ష్మి వ్రతాలకు దరఖాస్తుల పంపిణీ

శ్రావణ మాసం మూడో శుక్రవారమైన 23వ తేదీన అమ్మవారి ఆలయంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఆదివారం దరఖాస్తులను పంపిణీ చేశారు. మహా మండపం నాల్గవ అంతస్తులోని పూజల విభాగంలో ఈ దర ఖాస్తులను అందజేస్తుండగా, పెద్ద సంఖ్యలో మహిళలు దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం, మధ్యా హ్నం రెండు షిఫ్టులలో ఆలయ అధికారులు ఈ దరఖాస్తులను అందజేశారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులను తీసుకువచ్చిన వారికి దరఖాస్తును అందిస్తున్నామని, ఆదివారం ఒక్క రోజే 200 మందికి పైగా దరఖాస్తులను అందించామని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తులను అప్పటికప్పుడు పూర్తి చేసి కార్యాలయంలో అందజేసిన వారి వివరాలను మాత్రమే రిజిస్టర్ చేస్తామన్నారు. మొత్తం 500 మందికి ఈ దరఖాస్తులను అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



మెట్ల పూజ చేస్తున్న మహిళలు



క్యూలో వేచి ఉన్న భక్తజనం



దుర్గా ఘాట్‌లో బస్సు ఎక్కుతున్న భక్తులు

నేడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ సోమవారం విజయవాడ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో సదస్సు నిర్వహించనున్నట్లు మాల మహానాడు, దళిత వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు పంతగాని రమేష్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టెల్లా కళాశాలలో ఉదయం 11 గంటలకు సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు ఉప్పులేటి దేవి ప్రసాద్ హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని మాల మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, మాల మహానాడు నాయకులు, మాల రాజకీయ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీ, ఎస్టీల హక్కులు, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సదస్సులో ప్రధానంగా చర్చ జరుతుందన్నారు. రాష్ట్రంలోని అంబేడ్కర్ ఆలోచనపరులు, రాజ్యాంగ పరిరక్షకులు సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వేముల దయారత్నం, గుంటూరు జిల్లా అధ్యక్షుడు వెంకట రత్నం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. డ్రాయిగ్ టీచర్ ఎం.దుర్గాభవాని విద్యార్థులకు బొమ్మలు గీయడంలో మెళుకువలు నేర్పించారు. అనంతరం పిల్లలకు కథలు చెప్పడం, చదివించడం చేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కె రమాదేవి మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతీ ఆదివారం చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బాలల ఊహాలోకం చాలా గొప్పగా ఉంటుందని, వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు శిక్షణలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్ దుర్గాభవాని

గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: మధుర గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకుల స్ఫూర్తి కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రను తిరగరాసిన గాయకులు చాలామందే ఉన్నారని వారిలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, పీబీ శ్రీనివాస్, మాధవపెద్దిసత్యం, భానుమతి లాంటి వారు ఎందరో ఉన్నారన్నారు. వారి సేవలను నేటి గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాపోషకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, చెట్లపల్లి మా రుతి ప్రసన్న, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు ప్రసంగించారు. గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సుశీల్‌కుమార్, డేవిడ్‌రాజు, ప్రిన్స్, కుమార్ గుప్తా, అయ్యప్పన్, స్వాతి, భారతి, రజని, దుర్గా నా గమణి, కామేశ్వరీలు చిత్ర గీతాలను ఆలపించారు.



గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను సత్కరించిన నిర్వాహకులు

• నగరంలో రాఖీ పౌర్ణమి సందడి





నగరంలో రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. సోమవారం రాఖీ పండుగ కావడంతో బీసెంట్ రోడ్డులో వివిధ రకాల రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. దీంతో మహిళలు రాఖీలను కొనుగోలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థి అనుమానాస్పద మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై నున్న పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. వాంబే కాలనీకి చెందిన షేక్ కేశవ్(17) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి చెల్లి ఇంటి తలుపులు మూసి ఉండటంతో స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా కేశవ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నాడు. మృతుడి తల్లి షేక్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు జీవాద్య లేడీస్ గ్రూప్ విజయవాడ వారి సహకారంతో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి. రత్న ఈశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎవరూ పట్టించుకోని వయోవృద్ధులను గుర్తించి వారికి 206 నెలలుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయం అని కొనియాడారు. అన్న ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు బీ సుజాత, జీవాద్య లేడీస్ గ్రూప్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములం కావడం సంతోషంగా ఉందని అన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని తాము వచ్చేనెల 29న శతాధిక వృద్ధులకు సత్కారం చేయనున్నట్లు తెలిపారు. శతాధిక వృద్ధులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే అంబికా ఫ్లేవ్‌ఫుడ్స్ వారి సౌజన్యంతో బ్యాగ్‌లు అందజేశారు. తొలుత నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, మధుసూధనరావు, ఎస్వీయూ సతీష్‌కుమార్, లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ రత్న ఈశ్వర్, జీవాద్య లేడీస్ గ్రూప్ ప్రతినిధులు

స్ఫూర్తి ప్రదాత సుభాష్ చంద్రబోస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి ప్రదాత అని, ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత దేశానికి సేవ చేయాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ చల్లా హరికుమార్ సూచించారు. నేతాజీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక దుర్గాపురం కొత్తవంతెన సెంటర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని కొనియాడారు. యువతలో దేశభక్తిని రగిలించి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన మహానీయుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. నేతాజీ భౌతికంగా లేకున్నప్పటికీ ప్రతి ఒక్కరి హృదయాల్లో ఎన్నటికీ నిలిచే ఉంటారని పేర్కొన్నారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోదావరి వెంకటేష్, కె. సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ చల్లా హరికుమార్

మధురంగా సాగిన వయోలిన్ కచేరీ

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఆదివారం అక్కరై సోదరీమణులు ఎస్. సుబ్బలక్ష్మి, ఎస్. స్వర్ణలత నిర్వహించిన వయోలిన్ కచేరీ మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తలను మధురంగా పలికించారు. కె. సాయి గిరిధర్ మృదంగంపై ఎమ్. హరిబాబు ఘటంపై వాయిద్య సహకారం అందించారు. స్వరఝరి కార్యదర్శి మాట్లాడుతూ సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు సుదీర్ఘ కాలం నగరంలోని సంగీత కళాశాలలో పనిచేశారన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా వందలాది కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అక్కరై సోదరీమణుల సంగీత సేవలను కొనియాడారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వయోలిన్‌పై కీర్తనలను పలికిస్తున్న అక్కరై సోదరీమణులు

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మతల్లికి బోనాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట ముత్యాలమ్మతల్లి అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు బోనాలు చేతబూని చుట్టుగుంట, కాకాని నగర్, అల్లూరి సీతారామరాజు వంతెన తదితర ప్రాంతాల మీదుగా డప్పు వాయిద్యాల నడుమ వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో ఎంపీ సతీమణి కేశినేని జానకి, ఎమ్మెల్యే సతీమణి బొండా సుజాత, స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి పాల్గొని పూజలు చేసి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు భీసం రాములు, ఉపాధ్యక్షుడు తోట పాండు, కార్యదర్శి నాగాంజనేయులు, కోశాధికారి హరి, లక్ష్మణ్, వల్లభనేని సతీష్ తదితరులు పర్యవేక్షించారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ - 1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2, పటమటలోని సర్కిల్ - 3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆయా ప్రాంతాల స్థానికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎస్టీ వర్గీకరణ అమలు చేయాలి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎస్టీల్లోని 35 తెగల మధ్య అంతర్గత సామాజిక న్యాయం కొరవడిందని, వారి మధ్య సమన్యాయాన్ని నెలకొల్పాలని ఎస్టీ వర్గీకరణ సాధన సమితి జాతీయ కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్టీ వర్గీకరణ అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సుప్రీం తీర్పు మేరకు వర్గీకరణ అమలు చేసి ఎస్టీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎస్టీ వర్గీకరణ సాధన సమితి కమిటీని నియమించారు. ఎస్టీ నాయకులు భూక్యా శ్రీనివాసరావు, రాచగిరి మధుసూదనరావు, చేపూరి పద్మజ, పాలపర్తి బాలాజీ, శ్రీనివాసరావు, మరకల ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జైసంతోషిమాత జయంతి ఉత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో వేంచేసి ఉన్న జైసంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు ఈ నెల19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 5గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాల తొలిరోజు రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విశేషాలంకరణ, లక్ష్మీ గణపతి హోమం, కుంకుమ పూజ, మహానైవేద్యం, పూజ్య స్వామీజీలకు సత్కార కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు రథోత్సవం జరుగుతుందన్నారు. 21న పూజా కార్యక్రమాల అనంతరం మ ధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రు లు కావాలని కోరారు. విలేఖరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీమంత్రి నాగేశ్వరరావు, ఎస్. మార్కేండేయులు, డి.గుండయ్య, చిన్ని లక్ష్మి, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రోడ్లను ఆక్రమించి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగజేస్తే చర్యలు తప్పవని సింగ్‌నగర్ సీఐ శివాజీ చిరువ్యాపారులు, బైకు యజమానులను హెచ్చరించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, కృష్ణాహోటల్ సెంటర్‌లోని ప్రధాన రహదారులపై సాయంత్రం వేళల్లో చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ప్రయాణికుల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సీఐ శివాజీ వ్యాపారులు, బైకు యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం, జరిమానాలు విధించడం చేస్తామని హెచ్చరించారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్



విజయవాడ కల్చరల్: సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్ అని శ్రీ నివేదిత సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు కొత్త జ్యోతి అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఆదివారం రక్షాబంధన్ పోటీలను నిర్వహించారు. కొత్త జ్యోతి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మంలో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానముందని తెలిపారు. రక్షాబంధన్‌తోనే జాతీయ సమైక్యత సాధ్యమన్నారు. 50 మంది సోదరీ సోదరులు పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు. దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ, సావిత్రి కళాపీఠం సభ్యులు పీ శ్రీనివాస్, ఎమ్ఎస్ నారాయణ పాల్గొన్నారు.